క్లుప్తంగా

ప్రారంభమైన శీతల గంగమ్మ జాతర



ప్రత్యేక పూజలందుకున్న శీతల గంగమ్మ

సిద్దవటం : మాధవరం – 1 పంచాయతీ పార్వతీపురంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కోడి పుంజులు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. మరికొందరు భక్తులు అమ్మవారికి కాయాకర్పూలను సమర్పించారు. జాతర మహోత్సవంలో భాగంగా అమ్మవారికి పాలాభిషేకం, పొంగళ్లు, తీర్థ ప్రసాదాలు, సాయంత్రం శక్తి పూజ, రాత్రి అమ్మవారి కథ, అమ్మవారి ఊరేగింపుతో గుడికి చేరు కార్యక్రమాలను నిర్వహిస్తామని గ్రామ కమిటీ వారు వివరించారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి డాక్టర్ శైలజ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. కుష్టువ్యాధి అనుమానితుల పట్టిలను పరీక్షించి వివరాలను సేకరించాలని సూచించారు. కుష్టువ్యాధి అనుమానితుల వివరాలు గోప్యంగా ఉంచాలని చెప్పారు. అలాగే సీజనల్ వారీగా పిల్లలకు వేసే టీకాల మందుల వివరాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పారామెడికల్ అధికారి శంభూప్రాద్ ఉన్నారు.

బెటాలియన్‌లో గార్డు రూం ప్రారంభం

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో కమాండెంట్ బంగ్లా వద్ద నూతనంగా నిర్మించిన గార్డు రూంను బుధవారం కమాండెంట్ రవిశంకర్, ఆయన సతీమణితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ పి.ఎస్.డి. ప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పుల్లంపేట : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఎంఈఓ నాగా తిరుమలరావు ఏజెన్సీ నిర్వాహకులకు తెలియజేశారు. బుధవారం మండలంలోని వత్తలూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ తనిఖీ చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

లక్కిరెడ్డిపల్లె : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి పేర్కొన్నారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాలలో బాలికలకు క్రీడలు ప్రాంతీయ క్రీడలు, కోకో, కబడ్డీ నిర్వహించారు. క్రీడలు విద్యార్థులలో సృజనాత్మకత, క్రీడా స్ఫూర్తి, ఏకాగ్రతను పెంచుతూ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతాయన్నారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులచే యోగా కార్యక్రమం నిర్వహించారు. పీడీ షర్మిలా, విద్యార్థునులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



నివాళి అర్పిస్తున్న పంజం సుకుమార్ రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని బొజ్జవారిపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ పాలెంకోట గంగయ్య (75) బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పంజం సుకుమార్ రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మలు బంగ్లామిట్టకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రజకులపై దాడులను అరికట్టాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని జిల్లా రజక సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.వి.కె.రాఘవేంద్ర, కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఎం.వి.రమణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డలో రజక కులానికి చెందిన శ్రీనుపై అత్యంత దారుణంగా దాడి చేశారన్నారు. దీనిని మరువకముందే ధర్మవరం నియోజకవర్గం వెల్దుర్తి గ్రామానికి చెందిన సూర్యనారాయణను కొందరు హత మార్చారన్నారు. దాడులను అరికట్టేలా చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

సమస్య పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని ఏజీ గార్డెన్ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడిని పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విశ్వనాధనాయక్ అధికారులను హెచ్చరించారు. బుధవారం ఆయన ఏజీ గార్డెన్ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాయచోటికి రెండు కిలోమీటర్ల దూరంలోని ఏజీ గార్డెన్‌కాలనీలో ఎలాంటి నీటి వసతి లేదన్నారు. వెలిగల్లు తాగునీటి పైపులైన్‌ను ఏజీ గార్డెన్ కాలనీ వరకు పొడిగించి ప్రజల నీటి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు.

వరిలో కాలిబాట.. లాభదాయకం

- మందులు పిచికారీకి అనుకూలం
- ఆమడ దూరంలో చీడ, పీడలు
- రైతులు ఈ పద్ధతిని అనుసరించాలని వ్యవసాయాధికారుల సూచన



లింగంపల్లె గ్రామంలో రైతులు వరిలో కాలిబాటలు తీసిన దృశ్యం

సిద్దవటం : వరినాట్లు వేసే రైతులు పొలంలో కాలి బాటలు తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. విత్తనాలను వెదజల్లినా, డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేసినా, నారుతో నాట్లు వేసినా వరిమడిలో తప్పనిసరిగా కాలి బాటలు తీయడం మరువవద్దు. ఇందు కోసం ఎలాంటి పెట్టుబడులు పెట్టనవసరం లేదు. పంట సాగులో ఎన్నో రకాల పరిష్కారం చూపేందుకు కాలిబాటలు దోహదపడుతుందని వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి సూచిస్తున్నారు.

తెగుళ్లకు దూరం

వరి దుబ్బలను ఆశించి పైరుకు నష్టం కలిగించే బూడిద రంగు దోమ, తెల్లదోమ, పచ్చదీపపు పురుగులను సకాలంలో చర్యలు చేపట్టేందుకు కాలి బాటలు ఉపయుక్తంగా ఉంటాయి. వీటి వల్ల పొలం నుంచి మురుగు నీటిని తొలగించడం, సులభంగా ఉంటుంది.

నాట్లు పూర్తయ్యాక..

వరినాట్లను పూర్తిగా వేసిన తరువాత వరిమళ్లలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పున తూర్పు, పడమర దిక్కులో కాలిబాటలు వేయాలి. నాట్లు వేసిన 12 నుంచి 16 రోజుల్లో వీటిని తీయడం మంచిది. మందపాటి తాడును తీసుకొని వరి మళ్లల్లోని అవతలి గట్టుకు ఒకరూ, ఇవతలి గట్టుకు ఇంకొకరు తాడును పట్టుకొని లాగాలి. ఆ తాడుకు 20 సెంటీమీటర్ల దూరంలో సమాంతరంగా మరో తాడును ఇదే పద్ధతిలో ఏర్పాటు చేసుకొని రెండు తాళ్ల మధ్య ఉండే వరి మొక్కలను తీసి పలుచగా ఉన్న ప్రాంతాల్లో నాటుకొని కాలిబాటలు తీసుకోవచ్చును.

కాలిబాటలు తీసుకునే విధానం ఇలా..

వరినాట్లు వేసేటప్పుడు కాలిబాటలు వేయాలంటే ముందుగానే రెండు గట్ల మధ్య తాళ్లు లాగి ఆ ప్రదేశాన్ని వదిలేసి వరినాట్లను నాటుకోవాలి. విత్తనాలను పొలంలో వెదజల్లిన పద్ధతిని పాటించిన రైతులు కూడా కాలిబాటలను తీసుకోవచ్చు. విత్తనాలను చల్లిన 15 నుంచి 20 రోజుల్లోగా వరి పైరు ఎదుగుతున్న సమయంలో మొక్కలను తొలగించి పక్కనే నాటుకోవడం ద్వారా బాటలు తీయవచ్చు. ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పుతో మొక్కలను తొలగించాలి. డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తనాలను వేసేటప్పుడు ఒక వరుస పూర్తయిన తరువాత 20 సెంటీమీటర్ల స్థలాన్ని వదిలి మరో వరుసలో విత్తనాలు పడేలా డ్రమ్ సీడర్ పరికరాన్ని పోనించాలి. దీంతో కాలిబాటలు ఏర్పడతాయి. సిద్దవటం మండలంలో ఖరీఫ్ సీజన్‌కు గాను ఇప్పటి వరకు 500 హెక్టార్‌లలో వరి పంటను సాగు చేశారు. ఈ ఏడాది మొత్తం 933 హెక్టార్‌లు సాగవుతుందని వ్యవసాయాధికారి పేర్కొన్నారు.

కాలి బాటలతో ఉపయోగాలు

కాలిబాటల విధానం వరి పైరుకు గాలి, వెలుతురు పుష్కలంగా అందుతాయి. దీంతో చీడ పీడలు ఆమడ దూరంలో ఉంటాయి. కిరణజన్య సంయోగ క్రియ బాగా జరుగుతుంది. మొక్కలకు పత్ర హరితం అధికంగా ఉత్పత్తి అవుతుంది. పంటకు ఎంతనీరు అవసరమో అంత మేరకే అందిస్తాయి. సాగు నేలలోని సేంద్రియ పదార్థాలు త్వరగా కుళ్లడానికి తోడ్పడతాయి. మొక్కలకు పోషకాలను అందిస్తాయి. అధిక దిగుబడులు పొందేందుకు ఇవి ముఖ్య భూమిక పోషిస్తాయి. పైరు కూడా ఆరోగ్యవంతంగా పెరుగుతుంది. గాలి మొక్కలకు సంవృద్ధిగా తగలడంతోపాటు కావాల్సినంత ఆక్సిజన్‌ను పొందేందుకు వీలుంటుంది. కలుపు నివారణకు, మందులు పిచికారీ చేయడం సులభం. ఎరువులను వరిమళ్లంతా కలియ తిరిగి సమానంగా వేయడానికి చాలా అనుకూలం. రైతులు పైరులో ఉండే లోపాలను, ఎదుగుదలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది.

చీడ పీడల ఉధృతి తగ్గించవచ్చు



మాది సిద్దవటం మండలం లింగంపల్లె గ్రామం. నాకున్న పొలంలో వరిపంట సాగు చేశాను. వ్యవసాయాధికారులు వరిలో కాలిబాటలు తీసుకోమన్నారు. దీని వల్ల పంటకు పుష్కలంగా గాలి వెలుతురు బాగా అంది చీడ పీడల ఉధృతిని కొంత వరకు తగ్గించవచ్చు. ఎరువులు, పురుగుల మందులు, కలుపు మందులు వేయడానికి పైరు పరిస్థితి గమనించడానికి ఈ బాటలు ఎంతగానో ఉపయుక్తంగా ఉన్నాయి. రైతులు ఈ పద్ధతిని అనుసరించడం శ్రేయస్కరం.

– పసుపులేటి వెంకటయ్య

దిగుబడులకు మంచి అవకాశం



వరి పొలంలో తూర్పు, పడమరకు కాలిబాటలు తీయడంవల్ల ఎక్కువగా వరి పైరుకు గాలి ప్రవేశించి దుబ్బలకు అధిక ఆక్సిజన్ అందిస్తుందన్నారు. దీనివల్ల మొక్కల్లో కిరణజన్యసంయోగ క్రియ బాగా జరిగి మొక్కలు పచ్చదనంతో నిండి దిగుబడులు ఇచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే వరిలో ఎక్కువ దుబ్బలు కట్టడానికి అవకాశం ఉందన్నారు.

– కె. రమేష్‌రెడ్డి, వ్యవసాయధికారి, సిద్దవటం

ఆలయంలో సంకటహర పూజలు

రాయచోటి టౌన్ : భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వినాయకుడికి సంకటహర పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి సంకటహర చతుర్థి సందర్భంగా వినాయకుడికి విశేషమైన అభిషేకాలు, పూజలు చేశారు. స్వామి వారికి గంధం, చందనం, పాలు, పెరుగు, పాలు, నెయ్యి, తేనె, కుంకమతో అభిషేకాలు నిర్వహించి స్వామికి ఇష్టమైన గరికెతో పాటు రంగురంగు పూలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. ఈ పూజలు ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు జరిపారు.

గ్యాప్ పొలం బడి

సంబేపల్లె : మండల పరిధిలోని నాగిరెడ్డిగారి పల్లె పంచాయతీలో బుధవారం పంటలు సాగు చేసిన రైతులతో జేడీఏ చంద్రానాయక్ పొలంబడి నిర్వహించి రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాప్ పొలంబడి ద్వార రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించడం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం వేరుశనగ సాగు చేసిన రైతులు రెండవ తవ్వకం సమయంలో ఎకరాకు 200 కిలోలు జిప్సం వేయాలి. దీంతో ఊడగలు వచ్చే సమయంలో గింజలకు నూనె శాతం పెరిగి కాయలకు అవుటస్ వస్తాయి. దీంతో రైతులకు గిట్టుబాటు ధర వస్తుందన్నారు. అనంతరం రైతులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సంచాలకులు శ్రీలత, ఏఈఓలు రెడ్డివెంకటరమణ, రేణక, రైతులు, పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

సిద్దవటం : వరిలో అక్కడక్కడ కాండం తొలుచుపురుగు, ఆకుచుట్టు పురుగులను గమనించామని వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని వంతాటిపల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పొలాలను బుధవారం వ్యవసాయాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటను ఆశించిన కాండం తొలుచు పురుగు, ఆకుచుట్టు పురుగుల నివారణకు క్లోరోఫైరీఫాస్ అనే మందును ఒక లీటరు నీటికి 2 ఎంఎల్ చొప్పున మందును, మరియు కార్బోఫీరాన్–3జి గుళికలను ఎకరాకు 10 కిలోలు చొప్పున ఇసుకతో కలిపి చల్లుకోవాలన్నారు. పొలంలో వరి నాటే సమయంలో వరి నారు కొనలను తుంచి నాటుకోవాలని, తద్వారా కాండం తొలుచు పురుగు నివారణ జరుగుతుందన్నారు. కాండం తొలుచు పురుగు తల్లి పురుగు గుడ్లను వరినారు కొనలపై నూగుతో కప్పి ఉంచుతుందన్నారు. కొనలను తుంచి నాటడం వల్ల ఈ సమస్యాత్మక పురుగును ప్రారంభ దశలోనే నివారించ వచ్చునని, తద్వారా పురుగుల మందును గణనీయంగా తగ్గించవచ్చునన్నారు. అలాగే ప్రతి 2 మీటర్లకు ఒక అడుగు విస్తీర్ణం చొప్పున కాలిబాటలు తీయాలని, తద్వారా దోమ పోటు నివారణకు మార్గం సుగమమవుతుందన్నారు. రసాయనిక మందులు పిచికారీకి, ఎరువులు చల్లుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రేమ్‌కుమార్, బి.శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

చిట్వేలి : ఆయిల్ పామ్ సాగు చేయడానికి రైతులను ప్రోత్సహిస్తున్నట్లు మండల ఉద్యాన అధికారిణి ఆషియా తెలియజేశారు. ఆయిల్ పామ్ సాగుపై పోల్లోపల్లి సచివాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారిణి ఆషియా మాట్లాడుతూ మండలంలో 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుకు ఉద్యానశాఖ శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పంట 30 ఏళ్ల వరకు దిగుబడినిస్తుందని తెలిపారు. నీటి వసతి సమృద్ధిగా ఉన్న తోటల్లో మొదటి మూడు సంవత్సరాలలో అంతర్ పంటలు వేసుకొని ఆదాయం పొందవచ్చన్నారు. సాగుకు 4 సంవత్సరాలపాటు ఆర్థికసాయం అందిస్తామన్నారు. ఆయిల్ పామ్ మొక్కల ఖరీదుపై వంద శాతం రాయితీతో ఒక హెక్టారుకు 125 విదేశీ మొక్కలను ఉచితంగా అందిస్తామన్నారు. దీంతోపాటు ఎరువులకు ఒక సంవత్సరానికి రూ. 4588లను అంతర్ పంటల సాగుకు అదనంగా మరో రూ. 5250లు సబ్సిడీ అందిస్తుందని చెప్పారు. అనంతరం ఇప్పటికే సాగులో ఉన్న ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, రైల్వేకోడూరు ఉద్యానాధికారి భాస్కర్, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రతినిధి కొండారెడ్డి, గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి




రాజంపేట టౌన్: ఎంపీడీఓకు వినతిపత్రం అందచేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజంపేట టౌన్ : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.చెంగల్‌రాజు, జిల్లా కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓకు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. జీఓ ఎంఎస్ నెం.117ను రద్దు చేసి జీఓ ఎంఎస్ నెం. 55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతో పాటు ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు తరగతులను ఒకే పాఠశాలలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయింపు, హైస్కూల్స్‌లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియామకం, కిలోమీటరు పైబడి దూరం నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. మున్సిపల్ టీచర్లకు పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలను, బాషా వలంటీర్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని తెలియజేశారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీసును వెంటనే విడుదల చేయాలని, పీజీటీలకు జూనియర్ లెక్చరర్ల హోదా కల్పించాలని, మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయుల సర్వీసులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జి.నాగేంద్ర, కె.శివయ్య, కె.రామచంద్ర, పి.రవిచంద్రప్రసాద్, కె.శివకుమార్, ఆర్.సుబ్రమణ్యం, యూ.వెంకటసుబ్బయ్య, ఏ.చంద్రయ్య, ఎం.వెంకటరమణ, జి.లింగప్ప పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి టౌన్ : నూతన ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు రెడ్డి రమేష్, కొండూరు శ్రీనివాస రాజులు బుధవారం విజయవాడలోని మాజీ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు ఏఎస్ రామకృష్ణ క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు.

ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వివాహాలు



వధూవరులను దీవిస్తున్న ఆకేపాటి జ్యోతి

రాజంపేట టౌన్ : మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లో బుధవారం ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వివాహాలను జరిపించారు. మండలంలోని శ్రీరంగరాజుపురానికి చెందిన సుమతి, వెంకటేష్, చిట్వేలి మండలానికి చెందిన లక్ష్మీపార్వతి, మల్లికార్జునల వివాహాలకు ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సతీమణి అమరజ్యోతి తాళిబొట్టు అందజేసి వివాహాలను జరిపించారు. ఈ సందర్భంగా వధూవరులు ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వివాహానికి వచ్చిన వారికి అల్పాహారం ఏర్పాటు చేసి ఆమె స్వయంగా వడ్డించారు.

నీటి సమస్య తీర్చండి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని మాసాపేట వద్ద నున్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో నెలకొన్న నీటిసమస్య తీర్చాలని ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథనాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్రనేత శంకర్ నాయక్‌లు జేసీ రాజేంద్రన్‌కు విన్నవించారు. బుధవారం జేసీని ఆయన ఛాంబర్‌లో కలుసుకున్న వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థినులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా నీరందని దౌర్భాగ్య స్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ గ్రాంటుతో పాఠశాలలో వెంటనే బోరును డ్రిల్‌చేయించి, మోటారు వేయించడం ద్వారా పాఠశాల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ వారు విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ హితంగా గణేష్ ఉత్సవాలు

రాయచోటి అర్బన్ : పర్యావరణ హితంగా వినాయకచవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వాసుబాబు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. సమావేశంలో కమిషనర్ వాసుబాబు, తహసీల్దార్ జయన్నలు మాట్లాడుతూ సెప్టెంబరు మాసంలో జరిగే గణేష్ ఉత్సవాలను మట్టితో చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే వినియోగించేలా ప్రజలను చైతన్యవంతులు కావాలన్నారు. పట్టణ పరిధిలో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేసి నిమజ్జనం చేసేలా ప్రజలు, ధార్మిక సంస్థలు సహకరించాలంటూ విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాలకు మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ ప్రచురించిన గోడపత్రాలు, కరపత్రాలను అధికారులు ఆవిష్కరించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

నందలూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ఉచిత పాఠ్యపుస్తకాలను అధ్యాపకులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థినులకు బుధవారం ప్రిన్సిపల్ జయలలిత కుమారి ఆధ్వర్యంలో అధ్యాపకులు అందించారు.

ఆధార్ సెంటర్ తనిఖీ

పెనగలూరు : మండలంలో స్పెషల్ డ్రైవ్ కింద సింగారెడ్డిపల్లి, నల్లపరెడ్డిపల్లి సచివాలయాలలో ఆధార్ స్పెషల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. సింగారెడ్డిపల్లి వద్ద ఉన్న ఆధార్ సెంటర్‌ను ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా హైస్కూల్ విద్యార్థులకు అడ్రసు మార్పు ఉన్నా, ఇంటి పేరులో మార్పు ఉన్నా, వయస్సులో తప్పులు ఉన్నా రికార్డులు పరంగా విద్యార్థులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ప్రభుత్వ భూమి గుర్తింపు

చిన్నమండెం : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ యంత్రాంగం కదిలింది. కలెక్టర్ ఆదేశానుసారం మండల రెవెన్యూ సిబ్బంది చిన్నమండెం రెవెన్యూ పరిధిలోని కేశాపురం చెక్‌పోస్టు వద్ద తోపు పరంపోకు సర్వే నెంబర్ 1693లో 1.21 ఎకరాలు, కేశాపురం బోనమల రోడ్డుకు ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 1641లో 86 సెంట్లు ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఇందులో ఎవరైనా ప్రవేశిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వీటిని తొలగించిన వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వీరబల్లె : మండల కేంద్రంలోని ఆసాదివాండ్లపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ చంద్రమోహన్ తన సిబ్బందితో వెళ్లారు. అక్కడ పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 6930లు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

నిబంధనలు పాటించని పాఠశాలలు

రైల్వేకోడూరు అర్బన్ : నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకొని వాటి గుర్తింపును రద్దు చేయాలని బుధవారం సీపీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాన్ ప్రసాద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

రాయచోటి అర్బన్ : సావిత్రిభాయి పూలే మహిళా ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లా నూతన కమిటీ ఎంపిక బుధవారం జరిగింది. బుధవారం పట్టణంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు దాసరి విజయలక్ష్మి పర్యవేక్షణలో నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. జిల్లా అధ్యక్షురాలిగా బి.ఉషా సుందరి, ప్రధాన కార్యదర్శిగా శ్రీవిద్య, ఉపాధ్యక్షురాలిగా రాధిక, సహాయ కార్యదర్శిగా శ్రీలక్ష్మి, ఆర్థిక కార్యదర్శిగా మునిలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి



రాయచోటి : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన నిధుల ప్రకటనను చూస్తే అప్పు చేసి పప్పు కూడు తినమన్నట్లు ఉందని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బుధవారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో కేంద్రం నుంచి నిధులను రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ఆయన విమర్శించారు. ఎన్డీయేలో కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ మరో భాగస్వామి జేడీయూ లాగా నిధులను రాబట్టలేకపోయిందన్నారు. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు చేసిన ప్రకటన బూటకమన్నారు. విదేశీ విత్త సంస్థల నుంచి రూ.15 వేల కోట్లను అప్పుగా సర్దుబాటు చేస్తామని, అవసరమైతే మరింతగా అదనపు అప్పుగా నిధులకు సహకరిస్తామని పేర్కొనడంపై కూటమి ప్రభుత్వం సిగ్గు లేకుండా అసెంబ్లీ సాక్షిగా హర్షం వ్యక్తం చేసిందన్నారు. విభజన చట్టంలో కీలకమైన పోలవరం ప్రాజెక్టు అంశాన్ని కూడా బడ్జెట్‌లో ప్రస్తావించినప్పటికీ, ఎంత నిధులు కేటాయిస్తారన్న విషయం చెప్పకపోవడం దారుణమన్నారు. ఇక నిర్వాసితులు, పునరావాసం తదితర అంశాలనే ప్రస్తావించలేదన్నారు. వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు గ్రాంట్లు విడుదల చేస్తామని ప్రకటించారే తప్ప ఎంత నిధులు ఎప్పటిలోగా ఇస్తామనేది చెప్పలేదని మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించండి



సూర్యనారాయణపురంలో పారిశుధ్య పనులు చేపట్టిన అధికారులు, నాయకులు

రామాపురం : పంచాయతీలలో పారిశుధ్యంపై దృష్టి సాధించాలని ఈఓపీఆర్‌డీ ఉషారాణి అన్నారు. గ్రామాలలో జరుగుతున్న పారిశుధ్యం పనులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పనులను పరిశీలించారు. బుధవారం కసిరెడ్డిగారిపల్లె, గువ్వలచెరువు, గోపగుడిపల్లె, బండపల్లి, చిట్లూరు, నీలకంఠ్రావుపేట తదితర గ్రామాలలో పర్యటించారు. మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సూర్యనారాయణపురంలో సర్పంచ్, కార్యదర్శి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని వీధులలో పారిశుధ్యం పనులు చేపట్టి అనంతరం దిబ్బలను తొలగించారు. వాటిపై బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనలక్ష్మి, కార్యదర్శి నాగవేణి, టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, చిట్టి రెడ్డయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



నాగిరెడ్డిని ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని మోటకట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు నాగిరెడ్డి పదవీ విరమణ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాపరంగా, సామాజిక పరంగా ఉత్తమ సేవలు అందించినప్పుడే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిని ఎంఈఓ, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ నరసింహారెడ్డి, అధ్యాపకులు సహదేవరెడ్డి, డీసీఈబీ కార్యదర్శి నాగమునిరెడ్డి, హెచ్‌ఎం శివయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తపాల శాఖ అధికారి అమర్‌నాథ్

రాయచోటి టౌన్ : తపాలా శాఖ వారి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్ తెలియజేశారు. బుధవారం రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామంలో సబ్ పోస్టాఫీస్‌లో తపాలాశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించే సేవలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తపాల శాఖలో పోస్టల్ సేవలతోపాటు పొదుపు, బీమా సేవలు ఉన్నాయన్నారు. ఈ సేవలను ప్రతి ఖాతాదారుడు ఉపయోగించుకొంటే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యుడు కూనా కృష్ణ దేవరాయులు, కొత్త సుదర్శన్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా డబ్బా.. మరుగున పడిందబ్బా



మండలంలోని దేవపట్లలో తపాలా శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తపాలా పెట్టె ఇలా రోడ్డు పక్కన చెట్టు కింద పడివుంది.

తపాలా శాఖ అందించే సేవా పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించే అధికారులు.. తపాలా శాఖ అంటేనే గుర్తుకు వచ్చే తపాలా పెట్టెలను భద్రపరిచే విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. గతంలో వర్తమానం తెలియజేసేవి ఉత్తరాలు. రాసిన ఉత్తరాలను తపాలా శాఖ డబ్బాల్లో వేసి అవతలి వారి స్పందన కోసం వేచి ఉండేవాళ్లం. కాలనుగుణంగా టెక్నాలజీ రావడంతో ప్రతి ఒక్కరి వద్ద మొబైల్ ఫోన్లు చేరాయి. ఏ సమాచారమైన క్షణాల్లో అవతలి వ్యక్తికి చేరువేస్తున్నారు. దీని వల్ల తపాలా పెట్టెలకు కాలం చెల్లింది. ఉత్తరాలు పంపేవారు అసలే లేకపోవడంతో తపాలా పెట్టెలు కనబడటం కూడా తగ్గిపోయాయి. సంబేపల్లె ప్రస్తుత తరానికి వీటి విలువ తెలియకపోయినా.. ఒకప్పుడు ఈ డబ్బాలు చేసిన సేవలకైన గుర్తింపు ఇవ్వాలంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

– సంబేపల్లె